క్లుప్తంగా

గో సంరక్షణ నిధికి రూ.లక్ష విరాళం


దాతను సత్కరిస్తున్న ఏఈఓ మోహన్

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ నిధి పథకానికి శనివారం హైదరాబాద్‌కు చెందిన దామినేని శ్రీహర్ష రూ.1,11,111 విరాళాన్ని ఆలయ ఏఈఓ ఐఎన్‌వీ మోహన్‌కి అందజేశారు. దాతకు దేవస్థానం తరపున స్వామి వారి శేషవస్త్రాన్ని, లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

కమనీయం... మహానందీశుడి కల్యాణం


కల్యాణం పూజలందుకున్న మహానందీశ్వరస్వామి దంపతులు

మహానంది: మహానందీశ్వరుడి దంపతులకు శనివారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. నిత్య కల్యాణోత్సవంలో భాగంగా అలంకార మండపంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు ముందుగా గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగళ్య ధారణ, అక్షింత సమర్పణ పూజల ను వైభవంగా చేశారు.

మాజీ సర్పంచ్ మృతి


గోవిందు(ఫైల్)

పగిడ్యాల: స్థానిక మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మేకల గోవిందు(70) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యతోపాటు జెడ్పీటీసీ సభ్యురాలు పుల్యాల దివ్య, సర్పంచ్ పెరుమాళ్ల భాస్కర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి తదితరులు గోవిందు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలి


విద్యార్థులకు సూచనలిస్తున్న డాక్టర్ భగవాన్‌దాస్

మహానంది: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించే విషయంలో ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భగవాన్‌దాస్ సూచించారు. స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో శనివారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చిన్నపాటి జ్వరాలు, దగ్గు, జలుబులను నిర్లక్ష్యం చేయకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు పొందాలని ఆయన విద్యార్థులకు సూచించారు. వార్డెన్ అంబమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయ సంఘం పట్టణ అధ్యక్షుడిగా రాజశేఖర్



నందికొట్కూరు: వాల్మీకి బోయ సంఘం పట్టణ అధ్యక్షుడిగా తనను ఎన్నుకున్నారని నల్లబోతుల రాజశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సంఘం జనరల్ సెక్రటరీ జక్కుల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు తనకు పట్టణ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారన్నారు. వాల్మీకులకు ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

అధికారపార్టీ నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారు

నంద్యాల(అర్బన్): పట్టణ శివారులోని వైఎస్సార్ నగర్, నందమూరినగర్ ప్రాంతాల్లో కొందరు అధికార పార్టీ నాయకులు పేదల ఇళ్ల స్థలాలను ఆక్రమించుకుంటున్నారని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయపులికొండన్న ఆరోపించారు. స్థానిక దేవనగర్‌లోని వాల్మీకి ఆలయ ఆవరణలో శనివారం ఆయన మాట్లాడుతూ 2013లో వాల్మీకులకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చిందన్నారు. గూడు కట్టుకొనే స్థోమత లేక కొందరు బేస్‌మెంట్ లెవెల్‌తో స్థలాలను ఉంచుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొందరు ఆ స్థలాలపై కన్నేశారన్నారు. వాల్మీకులను బెదిరిస్తున్నారన్నారు. తీరు మార్చుకోకపోతే వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మయ్య, మల్లికార్జున, రాజు, పరమేష్, రమేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఇందిరా ప్రియదర్శిని

నందికొట్కూరు: రాజీయే రాజమార్గమని సీనియర్ సివిల్ జడ్జి ఎం. ఇందిరా ప్రియదర్శిని అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ అప్పుల కేసులు, ఆస్తి తగాదాలు, చెక్‌బౌన్స్, క్రిమినల్ కేసులు మొత్తం 254 కేసులు పరిష్కారం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు వెంకటరాముడు, బ్యాంకు అధికారులు, పోలీసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 165 కేసుల పరిష్కారం

ఆత్మకూరు రూరల్: స్థానిక కోర్టుల సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 165 కేసులకు పరిష్కారం లభించింది. మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన మెగా లోక్ అదాలత్‌లో 146 పెట్టి కేసులు, 15 క్రిమినల్, 4 సివిల్ కేసులు రాజీ పద్ధతిలో పరిష్కారమయ్యాయి. బ్యాంకుకులకు సంబంధించిన 24 కేసులు కూడా డిస్పోజ్ అయ్యాయి. కార్యక్రమంలో న్యాయవాదులు గోవిందరెడ్డి, వెంకటేశ్వర్లు, గిరిరాజు తదితరులు పాల్గొన్నారు.

● జూపాడుబంగ్లా: నందికొట్కూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన మెగాలోక్‌అదాలత్‌లో మండలానికి సంబంధించిన 16 కేసులు పరిష్కారమైనట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఇరువర్గాల అంగీకారంతో రాజీ చేసి, కేసులను న్యాయమూర్తి కొట్టివేసినట్లు తెలిపారు.

● మహానంది: నంద్యాలలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో మహానంది పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన 12 కేసులు పరిష్కారమైనట్లు ఎస్‌ఐ రామ్మోహన్ రెడ్డి తెలిపారు.


కేసులను పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

విద్య లేకనే చెంచుల వెనుకబాటు

● నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి


చెంచు గిరిజన మహిళలతో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

పాములపాడు: విద్య లేకపోవడంతోనే చెంచు గిరిజనుల వెనుకబాటుకు కారణమని నంద్యాల ఎంపీ, లోక్ సభ టీడీపీ ఫ్లోర్ లీడర్, జిల్లా అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శనివారం మండలంలోని వేంపెంట చెంచు గూడెంలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెంచులకు కేటాయించిన నిధులను వారి అభివృద్ధికే ఖర్చు చేసేలా చూస్తామన్నారు. నల్లమల అటవీ ప్రాంత పరిధిలో 42 చెంచు గూడేలు ఉన్నాయని, అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక నిధులు ఖర్చు చేస్తున్నా కనీస వసతులకు నోచుకోకపోవడం బాధాకరమన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, అంతర్గత సీసీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవల విస్తరణ, పక్కా గృహాలతో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత నిర్బంధ విద్య చెంచు విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిధులు పక్కదారి పట్టినా, దుర్వినియోగమైనా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వేంపెంట గ్రామంలోని హెల్త్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. చెంచులకు నిత్యవసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు టేకూరి రామసుబ్బమ్మ, టెలికాం సలహా కమిటీ సభ్యుడు కురువ రమేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణమాడ వీధులలోని నిత్యకళావేదికపై విజయవాడకు చెందిన నటరాజ రామకృష్ణ ఆర్ట్స్ అకాడమీ వారి కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. వినాయకకౌత్వం, శివకైవారం, అయిగిరినందిని, త్రిపుర సంహారం, శివోహం, శివపంచాక్షరిస్తోత్రం, నమఃశివాయతే, హరహరశంకరా తదితర గీతాలకు, అష్టకాలకు నాగతన్విశ్రీ, యుక్తశంకరి, శ్రీజయహరిక, పుదీక్ష తదితరులు నృత్యాలు ప్రదర్శించారు.

20న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 20న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన తన స్వగృహంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రాప్‌రెడ్డితో కలిసి జాబ్‌మేళా వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. లోకల్ యాప్, ఐసీఐసీఐ బ్యాంకు, మహేంద్ర ఫైనాన్స్, అరబిందో ఫార్మ్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రతినిధులు హాజరై తమకు కావాల్సిన వారిని ఎంపిక చేసుకుంటారన్నారు. 10వ తరగతి, ఐటీఐ, డిప్లమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగులు జాబ్ మేళాను ఉపయోగించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9182217075, 6300324076 నంబర్‌లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి సుబ్బన్న పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ఆత్మకూరు: ప్రభుత్వ కళాశాలల్లో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ నాయకులు అబ్దుల్‌జబ్బార్, శివ, గంగప్రసాద్, శివశంకర్, చెన్నూడు తదితరులు శనివారం న్యాయశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌ను కలిసి విన్నవించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

టిప్పర్-మినీ వ్యాన్ ఢీ

నందికొట్కూరు: మండల పరిధిలోని బ్రాహ్మణ కొట్కూరు సమీపంలో కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై టిప్పర్-మినీ వ్యాన్ ఢీకొన్న ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ తిరుపాలు తెలిపిన వివరాలు.. కర్నూలు వైపు వెళ్తున్న సీఎస్‌కే టిప్పర్, మంత్రాలయం నుంచి శ్రీశైలం వెళ్తున్న మినీ వ్యాన్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

10 లీటర్ల నాటు సారా స్వాధీనం

మండల పరిధిలోని కోళ్లబావాపురం గ్రామానికి చెందిన రాఘవేంద్ర నుంచి 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకునట్లు ఎస్‌ఐ తిరుపాలు తెలిపారు.

ట్రాక్టర్-బైక్ ఢీ

నందికొట్కూరు: ట్రాక్టర్-బైక్ ఢీకొన్న ప్రమాదంలో కొణిదేల గ్రామానికి చెందిన సీఐటీయూ జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి గాయపడ్డాడు. అతడిని స్థానికులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తలకు, కాలుకు తీవ్రమైన గాయాలైనట్లు టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. భార్య శేషమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ముగ్గురికి గాయాలు


గాయపడిన తిక్కస్వామి


చెన్నరాయుడు


మాధులు


జూపాడుబంగ్లా: తంగడంచ బ్రిడ్జి వద్ద శుక్రవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనటంతో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. తాటిపాడు గ్రామానికి చెందిన తిక్కస్వామి, చెన్నరాయుడు వారి సమీప బంధువుకు ఆరోగ్యం బాగోలేకపోవటంతో చూసేందుకుని నందికొట్కూరు ఆస్పత్రికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. తంగడంచ సమీపంలోని బ్రిడ్జి వద్దకు చేరుకోగానే అక్కడ ఆగివున్న తంగడంచ గ్రామానికి చెందిన మాధులు ద్విచక్ర వాహనాన్ని వీరి ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో తిక్కస్వామి, చెన్నరాయుడులకు తీవ్రగాయాలు కాగా మాధులకు కాళ్లు విరిగాయి. క్షతగాత్రులను 108లో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అలగనూరు- రేగడగూడూరు మధ్య..


గాయపడిన దేవరాజు

మిడుతూరు: మండల పరిధిలోని అలగనూరు - రేగడగూడూరు మధ్య శనివారం ద్విచక్రవాహనంపై నుంచి అదుపుతప్పి కిందపడి ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. ఏఎస్‌ఐ సుబ్బయ్య తెలిపిన వివరాలు.. మిడుతూరు ఎస్సీ కాలనీకి చెందిన దేవరాజు ఎక్స్‌ఎల్ స్కూటర్‌పై బంధువల అంత్యక్రియతలకు హాజరయ్యేందుకని వెలుగోడు మండలం మోత్కూరు గ్రామానికి వెళ్లాడు. కార్యక్రమం ముగించుకుని మిడుతూరుకు బయలుదేరాడు. అలగనూరు - రేగడగూడూరు మధ్యలో అదుపుతప్పి కిందపడటంతో గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని దేవరాజును 108లో అస్పత్రికి తరలించారు.

విభిన్న ప్రతిభావంతులకు తల్లిదండ్రుల్లా సేవలు


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మదర్ ఆంథోనమ్మ, ప్రిన్సిపాల్ రీనా జోష్

మహానంది: విభిన్న ప్రతిభావంతులకు సెయింట్ ఆన్స్ సంస్థల కాలేజ్ ఆఫ్ డీఎస్ఈ(ఎంఆర్) తల్లిదండ్రుల్లా సేవలందిస్తోందని సొసైటీ ఆఫ్ సెయింట్ ఆన్స్(సీఎస్ఎస్ఏ) రెండు రాష్ట్రాల సుపీరియర్ జనరల్ మదర్ ఆంథోనమ్మ తెలిపారు. గోపవరం సమీపంలోని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ డీఎస్ఈ(ఎంఆర్) పదవ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్ ఆంథోనమ్మ మాట్లాడుతూ గోపవరం సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ డీఎస్ఈ ఏర్పాటైన పదేళ్లలో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. అనంతరం విభిన్న ప్రతిభావంతుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ సిస్టర్ రీనా జోష్ పాల్గొన్నారు.

వారిపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): పాములపాడు మండలం బానకచర్ల గ్రామంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకొని ఆన్‌లైన్ చేసుకున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపర చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కబ్జాకు గురైన భూమిలో 30సంవత్సరాలుగా 120 దళిత కుటుంబాలు నివాస స్థలాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తుంటే హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న కొందరు రెవెన్యూ అధికారులను అడ్డుపెట్టుకొని ఆన్‌లైన్‌లో వారి పేరు ఎక్కించుకోవడం దుర్మార్గమన్నారు. అధికారులు స్పందించి దీనిపై విచారణ చేపట్టాలన్నారు.





● కృష్ణమ్మ తీరం...అలల సోయగం

కృష్ణాతీరం అలలసోయగంతో పర్యాటకులను ఆకట్టుకుంటోంది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ పరిసరాలతో పాటు ఎత్తైన గేట్లపై నుంచి జాలువారుతూ ఎస్సారెమ్సీలో కృష్ణమ్మ హొయలొలుకుతూ వినసొంపైన సవ్వడులు చేస్తూ దిగువకు పరుగుతీస్తున్న దృశ్యం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. కనుచూపు మేరలో ఉన్న కృష్ణాజలాలు గాలుల తాకిడికి అలలు సవ్వడులు చేస్తున్న వయ్యారాలు పోతున్నాయి.

– జూపాడుబంగ్లా

మా ఉసురు తగులుతుంది



నా కూతురు అఖిలకు ఫస్ట్ టైం నీట్‌లో స్కోర్ 140 వచ్చింది. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన కొత్త మెడికల్ కళాశాలలకు సీట్లు కేటాయిస్తే నా కూతురుకు కచ్చితంగా సీటు వస్తుంది. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ కళాశాలలను రద్దు చేయమని కేంద్రానికి విన్నవించిందంట. ఏ నాయకుడైనా కళాశాలలు, సీట్లు మంజూరు చేసుకునేందుకు ప్రయత్నిస్తారు కానీ ఇలా రద్దు చేయమని కోరిన ముఖ్యమంత్రిని ఇప్పుడే చూస్తున్నాం. చంద్రబాబు నిర్వాకంతో మా పాపకు సీట్ రాదని తెలిసి అప్పు చేసి విజయవాడలో లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు పంపించాం. మాలాంటి పేదల ఉసురు చంద్రబాబుకు తగులుతుంది. – తలారి సుబ్బన్న, జి.వీరాపురం గ్రామం, కొత్తపల్లి మండలం

మల్లన్న సేవలో రాజస్తాన్ మంత్రి


ఆలయ రాజగోపురం వద్ద రాజస్తాన్ మంత్రికి స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను రాజస్తాన్ ప్రజారోగ్యశాఖ మంత్రి కన్హయా లాల్ చౌదరి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శనివారం మల్లన్న దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న రాజస్తాన్ మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు మంత్రి దంపతులకు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అధికారులు స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

గాడిచెర్ల సేవలు మరువలేనివి



గాడిచెర్ల హరిసర్వోత్తమరావు జయంతిని నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పాములపాడు: గాడిచెర్ల హరి సర్వోత్తమరావు సేవలు మరువలేనివి పలువురు కొనియాడారు. శనివారం గాడిచర్ల జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో ఆయన చిత్రపటానికి ప్రజా సంఘాల నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు సాములు, అంకన్న, షేక్షాఅలీ, సాయి, వార్డు సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ పాములపాడులో జన్మించిన గాడిచర్ల హరిసర్వోత్తమ రావు గ్రంథాలయాల ఉద్యమకారుడిగా, స్వాతంత్ర్య సమరయోధుడుగా, రచయిత, సంఘసంస్కర్తగా ఎన్నో సేవలు అందించారన్నారు. ఆయన పేరుతో ఢిల్లీ పార్లమెంట్‌లో విశ్రాంత భవనం, కర్నూలు జిల్లా కేంద్రంలో గ్రంథాలయం ఉండటం ఈ ప్రాంతం చేసుకున్న అదృష్టమన్నారు. గాడిచెర్ల జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.


గాడిచెర్ల హరి సర్వోత్తమరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గాడిచెర్ల సేవలు శ్లాఘనీయం

వెలుగోడు: ఆంధ్ర తిలక్‌గా, సాహిత్య వేత్తగా, పత్రికా సంపాదకుడిగా పేరుగాంచిన గాడిచెర్ల హరి సర్వోత్తమరావు సేవలు శ్లాఘనీయమని వక్తలు పేర్కొన్నారు. గ్రంథాలయ పితామహుడు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు జయంతిని స్థానిక గ్రంథాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి సుమలత, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్ రఘురాముడు యాదవ్, ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎంఎఫ్ ఇమ్మానియల్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం ఇవ్వాలి


మాట్లాడుతున్న లింగాపురం గ్రామ రైతులు

బండిఆత్మకూరు: ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఖరీఫ్ సాగుకు పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలని లింగాపురం గ్రామానికి రైతులు కృష్ణారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శేషాద్రి రెడ్డి కోరారు. శనివారం వారు మాట్లాడుతూ సాగుకు పెట్టుబడి సహాయం కింద రూ.20వేలు రైతుల ఖాతాలో వేస్తామని హామీ ఇవ్వడంతోనే తామంతా ఓట్లేశామన్నారు. అప్పు చేసి పంటలు సాగు చేశామని, అధిక వర్షాలకు పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు.

ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు


సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల కార్యదర్శి ఎస్.స్వాములు అన్నారు. శనివారం మండల పరిధిలోని సింగరాజుపల్లె ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు సంజీవరాయుడు, కేవీపీఎస్ జిల్లా నాయకుడు ఎన్.సంపత్‌కుమార్, సర్పంచు నక్క విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

ఆత్మకూరు: విజయవాడ వరద బాధితల సహాయార్థం స్థానిక పెద్ద మదర్సా మదీనా తుల్ ఉలుమ్ అధ్యక్షులు ఎం.ఎ.రషీద్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు రూ.లక్ష విరాళమిచ్చారు. శనివారం వారు వెలుగోడు మండలం వేల్పనూరు గ్రామంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని కలిసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు ఎం.ఎ.రషీద్ మాట్లాడుతూ ఆపదల్లో ఉన్న వారిని మానవతా దృక్పథంతో ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు అబ్దుల్ వహాబ్, సెక్రటరీ వలి, ట్రెజరర్‌లు ఎంటి.రహంతుల్లా, మహబూబ్‌బాషా, హెచ్ఎం మౌలానా ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకులు..

ఆత్మకూరు మండలంలోని వివిధ గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయకులు, బండి ఆత్మకూరు ఎమ్మార్పీఎస్ నాయకులు రూ.45 వేలను విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు చిలక రాబిన్సన్‌రాజ్, జిల్లా అధికార ప్రతినిధి బాషపోగుల దరగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మదనపల్లి బుజ్జి, నియోజకవర్గ నాయకులు వరదరాజులు, రామారావు, ఆత్మకూరు. బండి ఆత్మకూరు మండలాల ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

– జూపాడుబంగ్లా: మండలంలో సీపీఐ సేకరించిన 10 బస్తాల బియ్యం, దుప్పట్లు, ఇతర నిత్యావసర వస్తువులను శనివారం విజయవాడ వరద బాధితులకు పంపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేష్‌బాబు, సదాశివుడు, సిద్దయ్యగౌడు, మధు, నాగిరెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.